క్లుప్తంగా

కంటి వెలుగును విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పుట్ట శైలజ

మంథని: ప్రభుత్వం ఈ నెల 18 నుంచి చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్టశైలజ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శంకరాదేవితో కలిసి వైద్య సిబ్బంది, మెప్మా ఆర్పీలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంటివెలుగు ప్రారంభోత్సవం ఉంటుందని, తర్వాత అన్ని వార్డుల్లో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వామ్యులు అయ్యేలా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శారద, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కరుణశ్రీ

ధర్మారం: ప్రభుత్వం మహిళ గ్రూప్ సభ్యులకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అన్నారు. మండల సమాఖ్య భవనంలో మంగళవారం ఎంఎస్‌ఓబీ, వీవోలతో ఏపీఎం తులసీ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రగతి మహిళా సమైక్య సంఘం సభ్యులకు సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఎంపీపీ కరుణశ్రీ సొంత ఖర్చులతో 50 కుర్చీలను బహూకరించారు. బ్యాంకు రుణాలను ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, రుణాలు సకాలంలో చెల్లిస్తే తిరిగి తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు అపర్ణ, ఏపీఎం తులసి, సీసీలు గుజ్జేటి స్వామి, సత్యనారాయణ, సంతోష్, ఆపరేటర్ జమున వీవోలు, వీఓఏలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మారం: పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని వెంటనే పంపిణీ చేయాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ప్రతి నెల 1 నుంచి 15వ తేదీవరకు పంపిణీ చేస్తుండగా ప్రస్తుతం ఇంకా పంపిణీ చేయకపోవటం దారుణమన్నారు. పేద ప్రజలు రేషన్‌కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రేషన్‌బియ్యాన్ని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశం, నాయకులు రూప్లా నాయక్, మోటపలుకుల అశోక్, కాంపెల్లి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గోదావరిఖని: వరంగల్ కోర్టు న్యాయవాది కొత్తపల్లి రాజుపై పోలీసులు దాడిచేయడాన్ని నిరసిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. న్యాయవాదిని సీఐ, పోలీసులు తిట్టి చేయిచేసుకున్నారన్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ రెండు రోజుల పాటు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం మున్సిఫ్ కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు చందాల శైలజ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడికి పాల్పడ్డ పోలీసులను సస్పెండ్ చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, గుర్రాల రాజేందర్, చెలకల పద్మజ, భాష అనురాధ, భూమయ్య, అంజయ్య,శెట్టి,ఎండీ ఉమర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వానర సైన్యం.. జనం పరేషాన్

- ఇళ్లలోకి చొరబాటు.. పాదాచారులపై దాడులు
- గుంపులుగా సంచరిస్తున్న కోతులు
- భయాందోళనలో ప్రజలు



మంథనిలోని ఓ ఇంట్లో సామగ్రి చిందరవందర చేస్తున్న కోతుల దండు

మంథని: డివిజన్ ప్రజలను కోతులు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇళ్లు, దుకాణాల్లోకి గుంపులు, గుంపులుగా చొరబడి వస్తు సామగ్రిని ఎత్తుకెళ్లడం, చిందర వందర చేస్తున్నాయి. అంతేగాకుండా అనేక మందిని గాయపరుస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్తున్న వారిపై దాడులు చేసి గాయపర్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మంథని మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడులో ఓ నిండు గర్భిణి ఇంటి ముందు కూర్చోగా మీదకు రావడంతో కిందపడి తీవ్ర ఇబ్బందిపడింది. ఇలాంటి సంఘటనలు రోజూ వెలుగుచూస్తున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా రోడ్ల వెంట గుంపులు సంచరించడం, తలుపులు తెరిచి ఉంటే చాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. పెంకుటిళ్లలు, రేకుల ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయి.

మరోమారు పట్టించాలి

ఏడాది క్రితం మంథని మున్సిపాలిటీ పరిధిలో కొతులను పట్టి ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతానికి తరలించారు. అలాగే కొండెంగలను సైతం తిప్పడంతో కోతుల బెడద తప్పిందని పట్టణ వాసులు ఊరట చెందారు. కాని గత కొన్ని నెలలుగా వానర సైన్యం మంథనిలో బీభత్సం సృష్టిస్తుండడంతో జనం ఆందోళనకు గురవుతున్నారు. ఆడా ఈడా అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ వానర సైన్యం దర్శనమిస్తూ జనంపై దాడులు చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఆయా వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపాలిటీలో నెలకొన్న కొతుల బెడద నివారణకు మరోమారు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోతుల బెడదను తీర్చాలని కోరుతున్నారు.

తలుపు తీయాలంటేనే భయం



కోతులతో బాగా పరేషాన్ ఉంది. ఇంటి తలుపులు తీయాలంటే భయమేస్తాంది.గుంపులు, గుంపులుగా వస్తున్నయ్. ఇంట్లో చొరబడి సామాన్లు ఎత్తుకెళ్తన్నాయి. బెదిరిస్తే మీదపడుతున్నయ్. బండిమీద పోతుంటే కవర్లు లాక్కుంటానయ్. కోతులతో బాగా ఇబ్బందిగా ఉంది. కోతుల బెడదను తీర్చాలి

– కొట్టి సంపత్, పోచమ్మవాడ, మంథని

కోతుల బెడదను తీర్చండి



మంథనిలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. వాటిని పట్టించి అటవీ ప్రాంతంలో వదిలివేయాలి. ఇళ్ల, చెట్ల మీదనే అడ్డాలు వేస్తున్నాయి, ఆదమరిస్తే దాడి చేస్తున్నాయ్. గుంపులు, గుంపులుగా ఉంటున్నాయ్. పాలక వర్గం స్పందించి కోతుల బెడద తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– రాపర్తి అఖిల్, బతుకమ్మ చౌరస్తా,మంథని

సింగరేణి స్థలాలకు పట్టాలు అందజేయాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సింగరేణి స్థలాల్లో దశాబ్దకాలంగా నివాసాలు ఏర్పరుచుకున్న సింగరేణి కార్మికులకు జీవో నెంబర్ 76 ద్వారా పట్టాలు మాంజూరు చేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవో 76 అమలుతో పారిశ్రామిక ప్రాంతంలోని సింగరేణి స్థలాల్లో నివాసాలకు యాజమాన్య హక్కు పొందుతారన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో జీవో 76 కింద దరాఖాస్తులు చేసుకున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

12న రంగవల్లుల మహోత్సవం

గోదావరిఖని: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆడపడుచుల కోసం విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగవల్లుల మహోత్సవం ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. పోటీల్లో మొదటి బహుమతికి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30వేలు, మూడో బహుమతి రూ.10వేలు అందిస్తున్నామన్నారు. గోదావరిఖని జీఎం ఆఫీస్ మైదానంలో నిర్వహించే పోటీలకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు 9492650421, 9441665914 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ట్యాక్స్ చెల్లించని హోర్డింగ్స్ తొలగిస్తాం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో యాడ్ హోర్డింగ్స్ యజమానులు ఏడు రోజుల్లోగా ట్యాక్స్ చెల్లించకుంటే వారి హోర్డింగ్స్ తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. హోర్డింగ్స్‌పై సంబంధిత ఏజెన్సీ ఫోన్ నంబర్లను తప్పనిసరిగా రాయించాలని సూచించారు. ఇప్పటికే చాలాసార్లు హోర్డింగ్ యజమానులకు నోటీసులు జారీ చేశామని, ఏడు రోజుల్లోగా స్పందించి ట్యాక్స్ చెల్లించని వారి హోర్డింగ్స్ తొలగిచనున్నట్లు స్పష్టం చేశారు.

అల్లీపూర్‌లో కేసీఆర్ కప్ పోటీలు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్–2023 క్రీడలను మంగళవారం సుల్తానాబాద్ మండలం అల్లీపూర్‌లో ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

రాములపల్లిలో..

ఎలిగేడు: మండలంలోని రాములపల్లిలో మంగళవారం ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి సీఎం కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఎలిగేడు: మండల నూతన నాయబ్ తహసీల్దార్‌గా మంగళవారం ఎస్.సాయికృష్ణ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నాయబ్‌తహసీల్దార్‌గా పనిచేసిన రాపెల్లి రాముడు ఆర్డీవో కార్యాలయానికి బదిలీకాగా, ఆయన స్థానంలో సాయికృష్ణ ఇక్కడికి వచ్చారు.

సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు

రామగిరి: మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) నుంచి నిధులు మంజూరైనట్లు ఎంపీపీ ఆరెల్లి దేవక్క తెలిపారు. మండలంలోని 11 గ్రామాలకు రూ 1.66 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మండలంలోని రాజాపూర్‌కు రూ. 30 లక్షలు, బుధవారంపేటకు రూ. 21.8 లక్షలు, ఆదివారంపేట, బేగంపేట, సుందిళ్లకు రూ. 20 లక్షల చొప్పున, కల్వచర్ల, చందనాపూర్, నాగేపల్లి, పన్నూరు, రత్నాపూర్‌కు రూ.10 లక్షల చొప్పున, నవాబ్‌పేటకు రూ.5 లక్షలు మంజూరైనట్లు ఎంపీపీ పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ముత్తారం: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని అడవిశ్రీరాంపూర్ సర్పంచ్ తుంగాణి సమ్మయ్య యాదవ్ అన్నారు. గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటను ఏఈవో హారికతో కలసి పరిశీలించారు. నీటి వసతి తక్కువగా ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసుకోవాలని సూచించారు. వారి వెంట రైతు నిమ్మతి రవితో పాటు తదితరులు ఉన్నారు.

వృద్ధుడి కళ్లు సజీవం

ఓదెల: మండలంలోని బీమరిపల్లె గ్రామానికి చెందిన జీడీ మధునయ్య(80) అనారోగ్యంతో మృతిచెందగా సదాశయఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఐ బ్యాంకుకు తరలించారు. మృతుడి కుమారుడు సదయ్య–స్వరూప, కూతుళ్లు రజిత, రమను సదాశయ ఫౌండేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి లింగమూర్తి, డాక్టర్ వేణు, వాసు అభినందించారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లోవిధులు నిర్వహిస్తూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగుల డిపెండెంట్లు 10 మందికి మంగళవారం జీఎంలు తస్నీరు వెంకటేశ్వర రావు, ఎన్‌వీకే. శ్రీనివాస్ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అనంతరం జీఎంలు మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం ఒక వరం లాంటిదని, చెడు అలవాట్లకు బానిసై ఉద్యోగానికి గైర్హాజరు కావద్దని సూచించారు. క్రమశిక్షణతో పని నేర్చుకొని, సమష్టి కృషితో రక్షణతో పని చేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, అధికారుల ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఎస్‌ఓటూ జీఎం జి.రఘుపతి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కే.మారుతి పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

గోదావరిఖని: గోదావరినదిలో దూకి ముగ్గురి ప్రాణాలు కాపాడిన సింగరేణి ఉద్యోగి ఐరవేన శ్రీనివాస్‌ను ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ మంగళవారం తన చాంబర్‌లో సన్మానించి అభినందించారు. జీడీకే–7 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసే శ్రీనివాస్ ఇంటికి వెళ్తుండగా ఒక మహిళ ఇద్దరు పిలలతో గోదావరిలోకి దూకుతుండగా శ్రీనివాస్ నదిలోకి దూకి ముగ్గురి ప్రాణాలను కాపాడటం సాహసోపేతమన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీక్రిష్ణ, నాయకులు, కార్మికులు శ్రీనివాస్‌ను సన్మానించారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

సుల్తానాబాద్: ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు ప్రజల మనసుల్లో చిరకాలం గుర్తుండిపోతారని సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి సుల్తానాబాద్ మినీ కలెక్టరేట్‌లో బదిలీపై వెళ్తున్న నయాబ్ తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డికి నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో మాట్లాడారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు, తహసీల్దార్ యాకన్న, నాయబ్ తహసీల్దార్ సదానందం, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచులు,ఎంపీటీసీలు,నాయకులు పాల్గొన్నారు.

అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలి

రామగుండం: ఈనెల 18నుంచి 22 వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం విధానాలపై మహాసభలో చర్చకు రానున్నాయన్నారు. ఈ మహాసభలకు అధిక సంఖ్యలో తరలివచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తుంగపిండి మల్లేశ్, మగ్గిడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లి వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు రోడ్డు పనులు ప్రారంభించిమన్నారు.డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, డెప్యూటీ మేయర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర శంకర్ గౌడ్, సింగం మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

గాండ్ల తిలకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దామోదర్

మంథని: గాండ్ల తిలకుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా మంథనికి చెందిన సంగెం దామోదర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మంగళవారం మంథనిలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెం రవికుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సర్వ చిన్న బాపు, ప్రధాన కార్యదర్శిగా సర్వ శ్రీనివాస్, కోశాధికారిగా సంగెం జనార్దన్, ప్రచార కార్యదర్శిగా సర్వ నాగరాజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్, సంగెం వెంకటరాజం, కోశాధికారి చంద సతీశ్, కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు సర్మేట శేఖర్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల లెక్చరర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శశికిరణ్

ధర్మారం: పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ కళాశాలల లెక్చరర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ధర్మారం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ అత్రం శశికిరణ్ ఎన్నికైె నట్లు ఎన్నికల అధికారి కల్పన తెలిపారు. శశిధర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా శశికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్ల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానన్నారు. శశికిరణ్ నియామకంపై పలువురు లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు.

సోషల్ స్టడీస్ టీచర్స్ కార్యవర్గం ఖరారు

పెద్దపల్లిరూరల్: జిల్లా సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఖరారు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా మార రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రాజనర్సు, గౌరవ అధ్యక్షుడిగా వీర లక్ష్మణ్, సలహాదారుగా చాట్ల అగయ్య, కోశాధికారిగా రాజయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, రామచంద్రం, రమేశ్, కుమారస్వామి, కార్యదర్శులుగా బిరుదు మదుసూదన్, సీమాబేగం, జాడి రవి, ప్రవీణ్ ఎన్నికయ్యారు.

విద్యార్థినికి అభినందన

ముత్తారం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ కళాశాలలోని ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థిని టీ.కావేరి నేషనల్ కుంగ్‌ఫూ కరాటేలో గోల్డ్ మెడల్ సాధించినట్లు ఎస్‌వో కమల తెలిపారు. ఈ సందర్భంగా కావేరిని, ఆమె తండ్రి లాలాగౌడ్‌ను వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్ రావు, కేజీబీవీఎస్‌వో కమల, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి అదృశ్యం

ముత్తారం: మండలంలోని దర్యాపూర్ గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై బేతి రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాపూర్ గ్రామానికి చెందిన కొంకటి అనిల్ రెండు రోజులుగా కనిపించడం లేదని అనిల్ తండ్రి రాగయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదమని తెలిసినా..



సుల్తానాబాద్: పట్టణం నుంచి వివిధ గ్రామాలకు వ్యవసాయ పనులకు కూలీలు ఆటో ట్రాలీల్లో వెళ్తున్నారు. ప్రమాదమని తెలిసినా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కూలీలు వాపోతున్నారు. జీవనోపాధి కోసం వ్యవసాయ పనులకు కూలీకి వెళుతున్నట్లు తెలిపారు. ఆటో ట్రాలీల్లో గూడ్స్ మాత్రమే సప్లై చేయాలని, కూలీలను తీసుకెళ్లడం చట్ట విరుద్ధమని అధికారులు చెప్తున్నారు.

కంటి వెలుగుకు బల్దియా ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న నగర కమిషనర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో త్వరలో నిర్వహించబోయే కంటి వెలుగుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం అధికారులతో కార్పొరేషన్ కమిషనర్ బి.సుమన్ రావు సమీక్ష నిర్వహించారు. 50 డివిజన్ల పరిధిలో మొత్తం 57 కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి కేంద్రాల్లో కంటి వెలుగు సేవలను కొనసాగనున్నాయని, ఈ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలను నగరపాలక సంస్థ సమకూర్చాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆయా డివిజన్లలో పర్యటించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కేంద్రాల్లో సమకూర్చాల్సిన సౌకర్యాల నివేదికను కమిషనర్‌కు సమర్పించారు. కేంద్రాల్లో అవసరమైన కుర్చీలు, టెంట్లు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యంను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, సూపరింటెండెంట్ మనోహర్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ రాయలింగు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'గడపగడపకూ కాంగ్రెస్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపరచి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతునివ్వాలని అభ్యర్థించేందుకే 'గడపగడపకు కాంగ్రెస్' కార్యక్రమాన్ని చేపడుతున్నామని పట్టణ పార్టీ అధ్యక్షుడు బి. సురేశ్‌గౌడ్ అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 11 నుంచి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తదితర నాయకులు పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిలర్లు మల్లయ్య, సంపత్, సుభాష్‌రావు, నాయకులు కుమార్, మస్రత్; సర్వర్, వీరేశం, రవి, నదీం, ఖాజా, అవినాశ్ తదితరులున్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నారాయణరావు

జ్యోతినగర్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని రామగుండం నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ నారాయణ రావు అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చెత్తను సులభంగా రీ–సైకిల్ చేయడానికి ఉపకరించే పరికరాలు, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విదానాలను అవగాహన కల్పించేందుకు నిర్వహించిన వ్యాసరచన , చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షన్–2023లో ఉత్తమ ర్యాంకు సాధించడంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిస్టమ్ అసిస్టెంట్ శ్రావణ్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తులు ఆహ్వానం

రామగిరి: పోలీస్ ఉద్యోగాల కోసం సింగరేణి సేవా సమితి ద్వారా ఉచిత శిక్షణ పొంది ఫిజికల్ టెస్ట్‌లో క్వాలీఫై అయిన అభ్యర్థులకు రాతపరీక్ష కోసం శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన ఇన్‌స్ట్రక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికార ప్రతినిధి విలాస్ శ్రీనివాస్ పోద్దార్ తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా 90 మంది అభ్యర్థులకు శిక్షణ అందించగా వారిలో 58 మంది ఫిజికల్ టెస్ట్‌లో క్వాలిఫై అయ్యారని ఆయన తెలిపారు. వ్రాత పరీక్ష కోసం అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రాక్టికల్‌గా అనుభవం, ఆసక్తి కలిగిన ఇన్‌స్ట్రక్టర్లు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు..

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ మోడల్ స్కూల్ లో 6 నుంచి 10 వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. 10 నుంచి ఫిబ్రవరి15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 16న పరీక్ష జరుగుతుందని వివరించారు.

మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల ఆదర్శ పాఠశాలలో 2023–2024 సంవత్సరం ప్రవేశానికి 6వ, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళాగా(మిగిలి)న సీట్ల భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి ఫిబ్రవరి 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్‌లో అడ్మిషన్లకు..

గోదావరిఖనిటౌన్: రామగుండం తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలలో అడ్మిషన్ల కోసం మైనార్టీ విద్యార్థులు ఈ నెల 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

18న మండల సర్వసభ్య సమావేశం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

21నుంచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని నందన గార్డెన్‌లో ఈనెల 21,22 తేదీల్లో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఛీఫ్ ఆర్గనైజర్ వెంకటేశ్ తెలిపారు. మంగళవారం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా విద్యాధికారి మాదవి ఆవిష్కరించారు. దేహధారుడ్యం పెంచుకోవడంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడేందుకు కరాటే ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో పల్లవి పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, కార్తీక్, రామకృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.